క్లుప్తంగా

అయ్యప్ప భక్తుల రక్తదానం



రక్తదానం చేస్తున్న అయ్యప్ప మాలధారులు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణ పరిధిలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో ఆదివారం కమిటీ సభ్యులు దేవదాసు, గురుస్వామి వెంకటేశులు ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం నిర్వహించారు. సుమారు 100 మందికి పైగా అయ్యప్ప మాలధారులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. రక్తదానంతో మరొకరి ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. అయ్యప్ప మాలధారులు పెద్ద ఎత్తున తరలివచ్చి, రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సాయి ప్రసాద్, న్యాయవాది వెంకటేశులు పాల్గొన్నారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

కళ్యాణదుర్గం: స్థానిక ఆర్టీసీ డిపోలో సోమవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకూ డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మేనేజర్ రామచంద్ర ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ ప్రయాణ అవసరాలపై సూచనలు సలహాలను 9959225862 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని సూచించారు. ఆర్టీసీ అభివృద్ధికి పాటుపడాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

కూడేరు: మండల పరిధిలోని కలగళ్ల గ్రామంలో ఆదివారం గ్రీన్ కో (గాలి మరల సంస్థ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. కంటి ఇతర పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారందరికి కంటి అద్దాలు, మందులను పంపిణీ చేశారు. ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, పాటించాల్సిన ఆరోగ్య సూత్రాలను వైద్యులు వివరించారు. కార్యక్రమంలో వైద్యులు భార్గవి, క్రిస్టోఫర్, గ్రీన్ కో ప్రతినిధులు దుర్గా ప్రసాద్, వెంకట కిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

మెడికల్‌షాప్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



సమావేశమైన మెడికల్ షాప్ యజమానులు

రాయదుర్గం: పట్టణ మెడికల్‌షాప్ అసోషియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం చిందనూరు కళ్యాణ మందిరంలో మెడికల్‌షాప్ యజమానులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యం శెట్టి, సెక్రెటరీగా జి.ఆనందబాబు, ట్రెజరర్‌గా హరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం శెట్టి మాట్లాడుతూ.. మెడికల్ షాపుల్లో నాణ్యత ప్రమాణాలతో కూడిన మందులను మాత్రమే విక్రయిద్దామన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా బాధ్యతగా ప్రతి యజమాని వ్యవహరించాలని సూచించారు. ఏ సమస్య వచ్చినా పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

లత్తవరంలో కార్తీక వన భోజనాలు



వన భోజనాలకు తరలివచ్చిన ప్రజలు

ఉరవకొండ: మండలంలోని లత్తవరం ఉమా మహేశ్వర గురుపీఠం ఆశ్రమంలో ఆదివారం కార్తీక వన భోజనాలు నిర్వహించారు. కార్తీక మాసం చివరి ఆదివారం కావడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కుటుంబ సభ్యులతో పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆశ్రమంలో చంద్రమౌళీశ్వర స్వామికి అభిషేకం చేశారు. ఉసిరి చెట్ల కింద కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం అందరూ ఒకచోట భోజనాలు చేసి సందడి చేశారు.

నాడు కరెంట్ కోతలు..
నేడు వెలుగుల జిలుగులు



75 వీరాపురం వద్ద నూతన సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న విప్ కాపు (ఫైల్)

- లో–ఓల్టేజీ సమస్యకు ప్రభుత్వం చెక్
- తొలి విడతలో 9 సబ్‌స్టేషన్ల నిర్మాణం
- రెండో విడతలో 16 సబ్‌స్టేషన్ల నిర్మాణం
- సుమారు రూ.72 కోట్లు వెచ్చిస్తున్న ప్రభుత్వం

రాయదుర్గం: టీడీపీ హయాంలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడేది. మండలానికి ఒకటి లేదా రెండు సబ్‌స్టేషన్లు ఉంటే మహా ఎక్కువ. వాటి ద్వారా వచ్చే లోడ్ సరిపడక రైతులు, గృహ వినియోగదారులు, పరిశ్రమల యజమానులు లో–ఓల్టేజీతో అవస్థలు పడేవారు. అయితే జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక విద్యుత్ రంగంలో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. వ్యవసాయం, పరిశ్రమలు, గృహ అవసరాలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అవసరాలకు తగ్గట్టుగా సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయిస్తూ అప్రకటిత విద్యుత్ కోతలు, లోఓల్టేజీ సమస్యలు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చూపుతున్నారు. రైతులకు పగటి పూట 9 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా జరిగేలా చూస్తున్నారు. ఈ కారణంగా వ్యవసాయంతో పాటు పారిశ్రామిక, పర్యాటక, ఆక్వా లాంటి అనేక రంగాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. అడిగితే కాని సమస్య పరిష్కరించని రోజుల నుంచి అడక్క ముందే రైతులు, ప్రజల కష్టాలను తీర్చే ప్రభుత్వం చూస్తున్నామని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

తొమ్మిది సబ్‌స్టేషన్ల నిర్మాణం

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని 76,410 వ్యవసాయ, 1,81,364 గృహాలు, పరిశ్రమలకు చెందిన కనెక్షన్లు ఉన్నాయి. వీటన్నింటికీ ఇప్పటి దాకా కేవలం 50 సబ్‌స్టేషన్ల ద్వారా విద్యుత్ సరఫరా చేపట్టారు. లో–ఓల్టేజీతో నాణ్యమైన విద్యుత్ సరఫరాకు పలు చోట్ల అంతరాయం ఏర్పడేది. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. ఇందులో భాగంగా తొలి విడతలో తొమ్మిది సబ్‌స్టేషన్ల నిర్మాణాలను ఈ నెలాఖరు లోపు పూర్తి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రెండో విడతలో మరో 16 సబ్‌స్టేషన్ల నిర్మాణాలను వచ్చే ఏడాది 2024 మార్చి 31 లోపు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చేలా ట్రాన్స్‌కో అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట



రైతు సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ పెద్దపీట వేశారు. అవసరమైన ప్రతి చోట విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తున్నారు. నాణ్యమైన విద్యుత్ సరఫరాకు శ్రీకారం చుట్టారు. ఉరవకొండ పరిధిలో మరిన్ని సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రణాళికలు తయారు చేయించి సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లాం. ప్రస్తుతం ఎక్కడా విద్యుత్ సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు చేపట్టాం.

– విశ్వేశ్వరరెడ్డి, పార్టీ సమన్వయకర్త, ఉరవకొండ

అందుబాటులోకి వచ్చిన సబ్‌స్టేషన్లు

రాయదుర్గం నియోజకవర్గంలోని 75 వీరాపురం, శాంతినగర్, కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని గరుడాపురం, ములకలేడు, రాయలప్పదొడ్డి, ముద్దినాయనపల్లి, ఉరవకొండ నియోజకవర్గంలో గడేకల్లు విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయి. వీటిలో కొన్నింటినీ ఇప్పటికే ప్రారంభించగా మరిన్ని ఈ నెలాఖరులోపు ప్రారంభానికి సిద్ధమవుతున్నాయి.

రెండో విడతలో చేపట్టే సబ్‌స్టేషన్లు ఇవే..

రాయదుర్గం నియోజకవర్గంలో రెండో విడతలో డి హొన్నూరు, కొలగానహళ్లి, ఎర్రగుంట, బాదనహాళ్, నేమకల్లు, చెర్లోపల్లి, గోనేహాళ్, కలుగోడు, కెంచానపల్లి, వేపరాళ్ల గ్రామాల్లో, కళ్యాణదుర్గం నియోజకవర్గంలో గొల్లపల్లి, మాముదూరు, అల్లాపురం, గుద్దెళ్ల, కుందుర్పి, ఉరవకొండ నియోజకవర్గంలో రామసాగరం, నెరిమెట్ల ఇలా 16 గ్రామాల్లో సబ్‌స్టేషన్లను నిర్మించనున్నారు. వచ్చే ఏడాది మార్చి 31 లోపు ఈ సబ్‌స్టేషన్లను అందుబాటులోకి తీసుకురానున్నారు.

విద్యుత్ కనెక్షన్ల వివరాలిలా..

నియోజకవర్గం	సబ్ స్టేషన్లు	వ్యవసాయ కనెక్షన్లు	గృహ, వాణిజ్య కనెక్షన్లు
ఉరవకొండ	11	12,500	53,148
కళ్యాణదుర్గం	17	32,868	64,012
రాయదుర్గం	22	31,042	64,204

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు



నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు చేపట్టాం. ప్రజా అవసరాలను గుర్తించి కొత్త సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ప్రతి వెయ్యి కనెక్షన్లకు ఒక సబ్‌స్టేషన్ అందులోబాటులోకి తీసుకొచ్చాం. లో–ఓల్టేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. ఇది సీఎం వైఎస్ జగన్ చలువతోనే సాధ్యమైంది. టీడీపీ హయంలో రైతులు, ప్రజలు అష్టకష్టాలు పడ్డారు. నాణ్యమైన విద్యుత్ కోరుతూ పలు చోట్ల రోడెక్కి ఆందోళనలు చేసే పరిస్థితి. ఉచిత విద్యుత్‌పై చంద్రబాబు అవహేళనగా మాట్లాడారు. కాలవ మంత్రిగా ఉన్నా విద్యుత్ సమస్యకు పరిష్కారం చూపలేదు. జగన్‌తోనే సాధ్యమైందంటూ ప్రజలంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– కాపు రామచంద్రారెడ్డి, ప్రభుత్వ విప్

తొమ్మిది గంటల విద్యుత్



ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వ్యవసాయ బోర్లకు పగటి పూట తొమ్మిది గంటల పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరాకు శ్రీకారం చుట్టడం జరిగింది. పరిశ్రమలు, గృహ వినియోగదారులకు 24 గంటలు విద్యుత్ సరఫరా జరుగుతుండటంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ హయాంలో కంటే రెట్టింపుగా విద్యుత్‌ను అందుబాటులోకి తీసుకొచ్చాం. లో–ఓల్టేజీ సమస్య తీర్చేందుకే కొత్త సబ్‌స్టేషన్లను సీఎం జగన్ అందుబాటులోకి తీసుకొచ్చారు.

– కేవీ ఉషశ్రీచరణ్, మంత్రి

24 సబ్‌స్టేషన్ల ఏర్పాటు



రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ పరిధిలో ఇప్పటికే తొమ్మిది సబ్‌స్టేషన్ల నిర్మాణం పూర్తికావొచ్చింది. కొన్నింటినీ వినియోగంలోకి తీసుకొచ్చాం. రెండో విడతలో మరో 16 సబ్‌స్టేషన్లను వచ్చే ఏడాది మార్చి ఆఖరి నాటికి పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశాం. ఒక్కో సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ.2.50 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకూ వెచ్చిస్తున్నాం. ఈ లెక్కన ప్రభుత్వం సుమారు రూ.72 కోట్లు ఖర్చు చేస్తోంది. విద్యుత్ రంగంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అనేక సంస్కరణలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. వినియోగదారులంతా విద్యుత్ సరఫరాపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– శేషాద్రిశేఖర్, విద్యుత్‌శాఖ ఈఈ, కళ్యాణదుర్గం

సెమీ క్రిస్మస్ సందడి

కంబదూరు: మండలంలోని తిమ్మాపురం గ్రామంలోని సీఅండ్‌ఐజీ మిషన్ చర్చిలో ఆదివారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీఅండ్‌ఐజీ మిషన్ చర్చిల వైస్ చైర్మన్ రెవరెండ్ ఐజెయ్య హాజరయ్యారు. క్రీస్తుపుట్టుకను తెలియజేసి, సెమీ క్రిస్మస్ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పాస్టర్ ఎజ్రా, సర్పంచ్ సంధ్య, వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనారిటీ తాలుకా నాయకులు రవికుమార్, చర్చి సెక్రటరీ స్వామి దాస్, సంఘాల పెద్దలు ప్రసాద్ రామాంజి, తదితరులు పాల్గొన్నారు.



తిమ్మాపురంలో కేక్ కట్ చేస్తున్న పాస్టర్లు, సంఘం పెద్దలు

జేసీఎం చర్చిలో..

రాయదుర్గంటౌన్: పట్టణంలోని జేసీఎం చర్చిలో పాస్టర్ సాల్మాన్ అంపణ్ణ ఆధ్వర్యంలో ఆదివారం సపోజ్ క్రిస్మస్ సంబరాలు జరుపుకున్నారు. ముఖ్య సందేశకులుగా హాజరైన లెస్లై పింటు (బెంగళూరు), సామ్యూల్ రవి (బళ్లారి), ప్రభు (అనంతపురం) క్రీస్తు జననం, బోధనలు వివరించారు. ఏసు మార్గం సర్వమానవాళికి శ్రేయస్సుకు దోహదపడుతుందన్నారు. అనంతరం ఏసు ప్రభువు గీతాలు ఆలపించి, కేక్ కట్ చేశారు.



రాయదుర్గంలోని జేసీఎం చర్చిలో సపోజ్ క్రిస్మస్ వేడుకలు

పర్యావరణ పరిరక్షణతో మానవాళి మనుగడ



మాట్లాడుతున్న ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి

కుందుర్పి: పర్యావరణ పరిరక్షణ తోనే మానవాళి మనుగడ సాధ్యమని పర్యావరణ ప్రొఫెసర్లు పురుషోత్తం రెడ్డి, నరసింహారెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఎస్‌కే చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మొక్కలు నాటాలన్నారు. చెట్లును నరికి వేయకూడదన్నారు. సేంద్రియ ఎరువులను వాడాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్‌కే చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు లెనిన్ బాబు, కాలేజీ ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'కు 324 మంది రిజిస్ట్రేషన్



క్రీడా సామగ్రి పంపిణీ చేస్తున్న అధికారులు

వజ్రకరూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలకు మండల వ్యాప్తంగా 324 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు ఎంపీడీఓ విజయలలిత తెలిపారు. ఆదివారం క్రీడా సామగ్రి మండాలనికి చేరుకోవడంతో సచివాలయాల వారీగా పంపిణీ చేశారు. ఆసక్తి గలవారు ఈనెల 13వ తేదీలోపు గ్రామ, వార్డు సచివాలయాల్లో పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

నమోదుకు 13 వరకూ గడువు

బొమ్మనహాళ్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో పాల్గొనేందుకు పేర్లను నమోదు చేసుకునేందుకు ఈనెల 13వ తేదీ వరకూ గడువు ఉందని ఎంపీడీఓ షకీలాబేగం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం



20వ వార్డు పైతోటలో నీటి ట్యాంకును ప్రారంభించిన ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

- ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి
- రూ.14 లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభం

రాయదుర్గంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతున్నట్లు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో దాదాపు రూ.14 లక్షలతో నాలుగు వాటర్ ట్యాంకులు, 10వ వార్డు ఓంశాంతి సమీపంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్పతో కలిసి ప్రారంభించారు. విప్ మాట్లాడుతూ ఇది మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం అన్నారు. నియోజకవర్గంలో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి సీసీ రోడ్ల ముఖం చూడని గ్రామాల్లో రోడ్లు నిర్మించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రాయదుర్గం మున్సిపాలిటీలో దశలవారీగా, ప్రాధాన్యత క్రమంలో స్కీమ్ నిధులతో పాటు, గడప గడప కింద గుర్తించి ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ప్రజల సంతోషం, ఆకాంక్షకు అనుగుణంగా పాలిస్తూ దేశానికి ఆదర్శవంతంగా నిలుస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్ అన్నారు.

'కాలవ'వి నీచ రాజకీయాలు

మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు ఓ దగుల్బాజీ రాజకీయ నాయకుడు అని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి విమర్శించారు. టీడీపీ హయాంలో మంత్రిగా అవినీతి, అక్రమాలతో కోట్లకు పడగెత్తిన కాలవ ఎన్నికలు సమీపించడంతో ప్రజలను మభ్యపెడుతూ, గ్రామాల్లో కులాల మధ్య చిచ్చుపెడుతూ దొంగసెల్ఫీ అవతారాలతో నీచ రాజకీయాలకు తెరతీసినట్లు దుయ్యబట్టారు. రాష్ట్రంలో చంద్రబాబు, రాయదుర్గంలో కాలవ శ్రీనివాసులును మరోసారి ప్రజలు శాశ్వతంగా తరిమికొట్టే రోజులు సమీపించాయన్నారు. పేదలకు అందుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని అడ్డుకునేందుకు శతవిధాలుగా ప్రయత్నిస్తున్న చంద్రబాబు ఆటలు ఇక సాగవన్నారు. ఇచ్చిన మాట, అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి సీఎం వైఎస్ జగన్ పాలన సాగుతుండగా ప్రజలకు అన్ని రకాలుగా మంచి జరుగుతోందన్నారు. వ్యవస్థల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చి ప్రజల జీవితాల్లో మార్పు తెచ్చిన జగన్ వెంటే ప్రజలు ఉన్నారన్నారు. టీడీపీ కపట నాటకాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరక్టర్ ఇల్లూరి శ్రీనివాసులు, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు శ్రీనివాసయాదవ్, వలిబాషా, వార్డు కౌన్సిలర్లు సాబిరాబీ, బండి అజయ్, పైతోట సంజీవప్ప, శారదమ్మ, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ మేకల శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, జడ్పీటీసీ కలుగోడు మహేష్, కాంట్రాక్టర్ కాంతారెడ్డి, కౌన్సిలర్లు పొరాళ్ల గోవిందరాజులు, శ్రీనివాసరెడ్డి, ఫక్రుద్దీన్, ప్రతాప్, కోఆప్షన్ సభ్యుడు నజీర్, మైనారిటీ విభాగం నాయకుడు గోల్డ్ ఘని, వార్డు ఇన్‌చార్జ్‌లు పొరాళ్ల శివకుమార్, దివాకర్, తిమ్మరాజు, నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

ఉపాధ్యాయుడి ఆత్మహత్యాయత్నం

ఉరవకొండ: మండల పరిధిలోని పెన్నహోబిలంలో ఓ ఉపాధ్యాయుడు వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్యాయత్నం చేశారు. వివరాలు.. విడపనకల్లు మండలం పాల్తూరు ఎంపీయూపీ పాఠశాలలో పని చేస్తున్న మల్లేష్ ఆదివారం పెన్నహోబిలానికి వచ్చారు. అక్కడ నిద్రమాత్రలతో పాటు విష ద్రావకం తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. గమనించిన స్థానికులు అతడ్ని ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అత్యవసర చికిత్స నిమిత్తం అనంతపురం తీసుకెళ్లారు.

కళ్యాణదుర్గంలో పెళ్లి కాలేదని యువకుడు..

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని పార్వతీ నగర్‌కు చెందిన బోయ మురళి ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో విషద్రావకం తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. బోయ మురళికి కొంత కాలంగా పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. పెళ్లి కుదరక పోవడంతో మనస్థాపానికి గురైన అతడు విషద్రావకం తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతడ్ని చికిత్సల నిమిత్తం పట్టణంలోని ఆస్పత్రికి తరలించారు. డాక్టర్ల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు.

పాముకాటుతో రైతుకు అస్వస్థత

ఉరవకొండ: మండల పరిధిలోని నింబగల్లు గ్రామానికి చెందిన బసప్ప తన పొలంలో ఆదివారం పని చేస్తుండగా చెట్ల పొదల్లో ఉన్న పాము కాటు వేసింది. అపస్మారక స్థితికి చేరుకున్న బసప్పను గమనించిన కూలీలు వెంటనే ఉరవకొండ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు.

మాలధారుడికి గాయాలు

ఉరవకొండ: మండల పరిధిలోని పెన్నహోబిలం సమీపంలో ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో వెంకటేశ్వర స్వామి మాలాధారుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. ఉరవకొండ పట్టణంలోని ఇంద్రానగర్ మూడవ లైన్‌లో నివాసముంటున్న లాడిల్ వెంకటేష్ వెంకటేశ్వర స్వామి మాల ధరించాడు. ఆదివారం ఉరవకొండ మీదుగా తిరుమలకు ఐదుగురు మాలధారులతో కలిసి పాదయాత్రగా బయలుదేరాడు. పెన్నహోబిలం వద్ద వెళ్తుండగా.. ఎదురుగా వచ్చిన ద్విచక్రవాహనం వెంకటేష్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడ్ని ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కణేకల్లు ఎస్‌ఐగా శ్రీనివాసులు

కణేకల్లు: కణేకల్లు ఎస్‌ఐ శ్రీనివాసులను నియమిస్తూ ఎస్పీ అన్బురాజన్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ పని చేస్తున్న దుగ్గిరెడ్డిని వీఆర్‌కు పంపారు. వీఆర్‌లో ఉన్న శ్రీనివాసులుకు కణేకల్లు ఎస్‌ఐగా పోస్టింగ్ ఇచ్చారు. నూతన ఎస్‌ఐ శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

'డయల్ యువర్ డీఎం'కు రెండు వినతులు

రాయదుర్గంటౌన్: స్థానిక ఏపీఎస్ ఆర్టీసీ డిపోలో ఆదివారం సాయంత్రం 4 గంటల నుంచి 5 వరకూ డీఎం సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో డయల్ యువర్ డీఎం కార్యక్రమం జరిగింది. ప్రయాణికుల నుంచి రెండు ఫిర్యాదులు వచ్చినట్లు చెప్పారు. రాయదుర్గం నుంచి ఉదయం 5 గంటలకు అనంతపురానికి బయల్దేరే సర్వీసు సమయానికంటే ముందుగానే వెళుతున్నట్లు పలువురు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. అలాగే రాయదుర్గం మండలం కెంచానపల్లి గ్రామం నుంచి రాయదుర్గానికి అదనపు ట్రిప్ నడపాలని చంద్రమౌళి అనే వ్యక్తి కోరినట్లు పేర్కొన్నారు. ప్రయాణికుల సూచనలు పాటిస్తూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. డయల్ యువర్ డీఎం ద్వారా వచ్చిన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.

ఘనంగా ఆంజనేయ స్వామి రథోత్సవం

గుమ్మఘట్ట: మండలంలోని ఆర్.కొత్తపల్లి గ్రామంలో ఆదివారం ఆంజనేయస్వామి రథోత్సవం ఘనంగా జరిగింది. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఆలయంలో స్వామికి కుంకుమార్చన, ఆకుపూజ, మహామంగళారతి, పూర్ణాహుతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. రథం ముందు యువకులు ఉత్సాహంగా నందికోళ్లతో నృత్యం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామకృష్ణారెడ్డి, కొత్తపల్లి సత్యనారాయణరెడ్డి, హరినాథరెడ్డి, ఓంకార్‌రెడ్డి, వెంకటేశులు, ఈశ్వరరెడ్డి, రామిరెడ్డి, కృష్ణారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలకృష్ణ, దామోదర రెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బెళుగుప్పలో జ్యోతుల ఊరేగింపులో పాల్గొన్న మహిళలు



బొమ్మనహాళ్ మండలం దేవగిరి క్రాస్‌లో..



బ్రహ్మసముద్రం మండలం వేపులపర్తిలో..



బెళుగుప్పలో కనకదాస చిత్రపటంతో ర్యాలీ



కణేకల్లు మండలం ఆదిగానిపల్లిలో..

ఘనంగా కనకదాస జయంతి

బ్రహ్మసముద్రం మండలం వేపులపర్తి, నాగిరెడ్డిపల్లి, బొమ్మనహాళ్ మండలం శ్రీధరఘట్ట, దేవగిరి క్రాస్‌లో ఆదివారం భక్త కనకదాస జయంతిని ఘనంగా జరుపుకున్నారు. వేదావతి హగరి నది నుంచి ప్రత్యేక గంగా జలాన్ని 101 కలశాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి కనకదాస చిత్రపటానికి అభిషేకం చేశారు. అలాగే బెళుగుప్ప మండల కేంద్రంలో మహిళలు జ్యోతులతో తరలివచ్చి పూజలు చేశారు. యువత కనకదాస చిత్రపటాన్ని ట్రాక్టర్లలో కొలువుదీర్చి, వీధుల్లో ఊరేగించారు. కణేకల్లు మండలం ఆదిగానిపల్లిలో కనకదాస విగ్రహానికి ప్రత్యేక పూజలు చేయించారు. – సాక్షినెట్‌వర్క్: